ప్రజాశక్తి
శుక్రవారం 6 డిసెంబర్ 2024 5 అనంతపురం



నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకాపాల కట్టడిలపై దృష్టి సారించాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. గురువారం నాడు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లకు కార్యాచరణ ప్రణాళికలు పంపారు. ఈ ప్రణాళిక ప్రకారం ఆయా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనార్థాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, రోడ్డు ప్రమాదాలు, నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి తెలియజేయాలన్నారు. వాహనదారులు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించేలా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను యువతకు తెలియజేయాలన్నారు.

అసలు కంటే కొసరెక్కువ..!





◆ జనంపై విద్యుత్ ఛార్జీల బాదుడు
◆ విద్యుత్ బిల్లు రూ.295... ఇతర ఛార్జీలు రూ.459..!
◆ రూ.100 నుంచి రూ.500 వరకు విద్యుత్ ఛార్జీల భారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారాలను మోపింది. గత నెల నుంచే ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వేయగా ఈసారి ట్రూఅప్‌తోపాటు ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో అదనంగా భారాన్ని వేసింది. దీంతో అసలు విద్యుత్ ఛార్జీల కంటే కోసరు ఛార్జీల భారం సామాన్యులపై పడింది. విద్యుత్ బిల్లులు పెంచమంటూ హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే వివిధ రూపాల్లో విద్యుత్ భారాలు మోపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రుఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుంచి అసలు కంటే కొసరు రూపంలోనే ఎక్కువగా వసూలు చేస్తుండడం గమనార్హం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యుత్ ఛార్జీలకు సంబంధించి అక్టోబరు నెలతో పోలిస్తే నవంబరు, డిశెంబరు మాసాల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు ఒక్కో వినియోగదారుడిపైనా రూ.100 నుంచి రూ.500 వరకు అదనపు భారం పడింది. అనంతపురం జిల్లాలో 6.22 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరందిపైనా వివిధ రూపాల్లో భారాన్ని 30 శాతానికిపైగా విధించింది. వినియోగదారుల వారీగా చూసినప్పుడు మచ్చుకు కొన్ని ఉదాహరణలుగా ఇలాగున్నాయి.

గత నెలకంటే అదనం

అనంతపురం నగరంలోని హౌసింగుబోర్డు పరిధిలోనున్న వినియోగదారుడు సర్వీసు నంబరు 7112301078097కు నవంబర్ నెల విద్యుత్ బిల్లు రూ.947 వచ్చింది. ఇందులో విద్యుత్ వినియోగంపై వచ్చిన బిల్లు ఛార్జీ రూ.741 కాగా 2024 -9 ఎఫ్‌పిపిసిఎ రూ.69.60 విధించారు. ట్రూఅప్ కింద రూ.55.96 ఇతర ఛార్జీలు కలిపి మొత్తం రూ.947 బిల్లు వచ్చింది. అదే సర్వీసు నంబరులో డిసెంబర్ నెల బిల్లులో చూస్తే రూ.1044 వచ్చింది. ఇందులో విద్యుత్ ఛార్జీ బిల్లులు రూ.705 కాగా ఎఫ్‌పిపిసిఎ 04 రూ.131 , ఎఫ్‌పిపిసిఎ 10 రూ.71 ఇది కాకుండా ట్రూఅప్ మరో రూ.55 బిల్లులో చేర్చారు. రూ.257 రూపాయలు అదనంగా భారాన్ని వేయడం జరిగింది.

విద్యుత్ వినియోగ ఛార్జీ రూ295... అదనం రూ.459..!

అనంతపురం నగరంలోని మున్నానగర్‌లో ఒక వినియోగదారుడికి చూస్తే అసలు కంటే కొసరే ఎక్కువ వచ్చింది. 7112101012026 సర్వీసు నంబరుపై డిసెంబరు నెల బిల్లు రూ 754 వచ్చింది. ఇందులో విద్యుత్ వినియోగంపై వచ్చిన ఛార్జీలు చూస్తే రూ.295 ఉంది. ఎఫ్‌పిపిసిఎ 04 ఛార్జీల కింద రూ.227, ఎఫ్‌పిపిసిఎ 2024 10 రూ.58.80, సర్‌ఛార్జీ కింద రూ.25, ట్రూఅప్ ఛార్జీలు రూ.65.77 ఇలా అన్ని రకాల అదనపు బాధుడులను ప్రజలపై వేసింది. అసలు ఛార్జీ కంటే 60 శాతం అధికంగా అదనపు ఛార్జీలను వినియోగదారులపై వేసింది. మొత్తంగా చూసినప్పుడు ప్రతి వినియోగదారుడిపైనా గత బిల్లు కంటే 30 శాతం అదనంగా ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌సిసిఎ ఛార్జీల పేరుతో వినియోగదారులపై భారాన్ని వేసింది. ఛార్జీల పెంచబోమని ఎన్నికలకు ముందు హామీనిచ్చి ఇప్పుడు ఈ భారాలేమిటోనని వినియోగదారులు ఘొల్లు మంటున్నారు.

కియాతో ఉద్యోగాల వెలుగు

◆ మంత్రులు వాసంశెట్టి సుభాష్, ఎస్.సవిత ◆ కియా పరిశ్రమ సందర్శన



కియా ప్రతినిధులతో కలిసి కారును పరిశీలిస్తున్న మంత్రులు సుభాష్, సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కరువు జిల్లా ఉమ్మడి అనంతపురానికి కియా పరిశ్రమ ఉద్యోగ వెలుగులు తెచ్చిందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ తెలిపారు. యర్రమంచి గ్రామం వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమను గురువారం పరిశీలించారు. కియా సీఈవో కబ్ డాంగ్లీ, హెచ్‌ఒడిలు హాన్, మా, శాంగ్ జే, డా॥పాటిల్, డా॥సోమశేఖర్ రెడ్డి తదితరులు పరిశ్రమ ప్రగతిపై మంత్రులకు వివరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ కియా, అనుబంధ సంస్థల్లో సుమారు 20 వేలమంది ఉపాధి పొందడం హర్షణీయం అన్నారు. నూతన సాంకేతిక ప్రమాణాలతో కియా కార్లను ఉత్పత్తి చేస్తోందన్నారు. పరిశ్రమల స్థాపనపై వైసిపి పాలనలో పూర్తి నిర్లక్ష్యం కొనసాగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పలు పరిశ్రమల్లో భద్రత లోపాల కారణంగా 34 మంది కార్మికులు మరణించారన్నారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో వసుధ మిత్రా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వసుధా మిత్రా కమిటీని కియాలో సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ కియా ట్రైనింగ్ సెంటర్‌లో యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పతంలో పయనిస్తున్న కియాకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహాయక సహకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కియా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం : మంత్రి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమలు, బాయిలర్స్, ఇన్సూరెన్స్, ఆరోగ్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలిసి పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై యాజమాన్యాలు దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక రంగం కుంటుపడిందన్నారు. అనంతపురం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అవకాశాలు ఉన్నాయని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది. గతంలో భూ సర్వే చేసిన సందర్భంగా వచ్చిన సమస్యలు పరిష్కారం కావాలంటే ఉభయ రైతుల అంగీకరిస్తే రెవెన్యూ సదస్సుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి తహశీల్దార్లు లాగిన్ ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జాయింట్ ఎల్‌పిఎం పెట్టిన భూముల వివరాలకు ఈ గ్రామసభల్లో పరిష్కారం చేయడం ద్వారా గ్రామాల్లో భూ సమస్యలు కొంతమేరకు తగ్గుతాయన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చిన ప్రతి రైతుకూ రసీదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా గతంలో అమలు కాలేదన్నారు. సమస్యల అర్జీలు రశీదులు ఖచ్చితంగా ఇచ్చేలా జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కారం చేయాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో పాత రికార్డు లేదా కొత్తగా సర్వే చేసిన రికార్డును ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఏ రికార్డూ ఆన్‌లైన్‌లో పెట్టకపోవడం వల్ల కబ్జాలు పెరుగుతున్నాయన్నారు. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వన్‌బి, అడంగల్ రాక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అధికారులు వీటిని నిర్వహించాలని కోరారు.

అటెండరూ డిప్యుటేషన్‌పై బదిలీ..!

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండలంలో రెగ్యులర్ అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యల్లనూరు మండల ప్రజా పరిషత్ అభివద్ధి అధికారి మొదలు పశు వైద్యాధికారి వరకు అన్ని శాఖల్లో ఇన్‌ఛార్జుల పాలన సాగుతోంది. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయం అటెండర్ కూడా డిప్యుటేషన్‌పై రాప్తాడుకు బదిలీ అయ్యారు. ఇలా అధికారులు, సిబ్బంది ఒకరితర్వాత ఒకరు బదిలీ, డిప్యుటేషన్‌పై వెళ్తుండడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీలో మాత్రం కొందరు అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి ఇక్కడే పని చేస్తున్నారు. వీరిని బదిలీ చేయని ఉన్నతాధికారులు ఇతర శాఖల్లో ఉన్న వారిని డిప్యుటేషన్‌పై బదిలీ చేయడం ఏమిటన్నది అర్థం కావడం లేదంటూ కొందరు అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

అంబేద్కర్ సర్కిల్‌గా పేరు పెట్టండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఉన్న స్థలాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప అధికారులను కోరారు. అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను మండల రెవెన్యూ, ఇతర అధికారులు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరపాలని కోరారు. అంబేద్కర్ స్మారకార్థం బుక్కరాయసముద్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కూడలికి ఆయన పేరు పెట్టాలన్నారు. అధికారులు దీనిపై స్పందించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కూడలి పేరుతో ప్రదర్శన బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన
విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-యల్లనూరు

బుక్కాపురం, ఆరవేడు మధ్యలో చెలిమి కోనవెళ్ల మార్గంలోని 11 కెవి విద్యుత్‌లైన్‌తో పొంచి ఉన్న ప్రమాదం అన్న కథనం బుధవారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను మరమ్మతులు చేశారు. విద్యుత్ సరఫరా ఇన్సులేటర్‌ను మార్చి కొత్తదాన్ని అమర్చారు.

దాసరి మంజునాథ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -అనంతపురం




అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల రసాయనిక శాస్త్ర విభాగంలో సుదీర్ఘ పరిశోధనలకు సంబంధించి దాసరి మంజునాథ్‌కు అనంతపురం జెఎన్‌టియు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అనంతపురం జెఎన్‌టియు ప్రొఫెసర్స్ జివి.సుబ్బారెడ్డి, ఎస్‌వి.సత్యనారాయణ పర్యవేక్షణలో రసాయనిక విభాగంలో "స్పేషియల్ డ్రిస్టిబ్యూషన్ ఆఫ్ యురేనియం అండ్ అసోసియేటెడ్ వాటర్ క్వాలిటీ పారామోటర్స్ ఇన్ గ్రౌండ్ వాటర్ ఆఫ్ రాయలసీమ రీజియన్ (అనంతపురం, చిత్తూరు, కర్నూల్, కడప ఆంధ్రప్రదేశ్)" అనే అంశంపై పరిశోధన చేసిన దాసరి మంజునాథ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించింది. దాసరి మంజునాథ్ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం దుద్దేబండ గ్రామస్తుడు. అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల రసాయనిక విభాగంలో ఆయన చేసిన జర్నల్స్ పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారు.

సమస్యలపై మంత్రికి సిఐటియు వినతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు కోరారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నెలనెలా కార్మికులకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. కార్మికులకు సకాలంలో వేతనాలు, గ్రాట్యూటీ, బోనస్ వంటి చెల్లించాలన్నారు. 10 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికులందరిని సెమిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు చెల్లించాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. తాగునీరు ఉచితంగా అందించాలని, నీటి మీటర్లు బిగించరాదన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీవో ప్రకారం రూ.21 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. నగర విస్తీర్ణం జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, క్యాజువల్ లీవులు అమలు చేయాలన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు ఎన్.శ్రీనివాసులు, జి.త్రిలోక్‌నాథ్, ఆర్.ఎర్రిస్వామి, వన్నూర్‌స్వామి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ముత్యాలప్ప, జిలాన్‌బాషా, గ్రానైట్ టైల్స్, లేయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, రాడ్ బెండార్స్ యూనియన్ నాయకులు సూర్యనారాయణ, రాంమ్మోహన్ పాల్గొన్నారు.

'స్టూడెంట్ చాప్టర్'తో నైపుణ్యం మెరుగుదల

జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శనరావు



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శనరావు

ప్రజాశక్తి -అనంతపురం

విద్యార్థుల నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు స్టూడెంట్ చాప్టర్ తోడ్పడుతుందని ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. జెఎన్‌టియు అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో స్టూడెంట్ ఛాప్టర్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా॥అజిత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్య మెళకువలు ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, పిఆర్ భానుమూర్తి, స్పెషల్ ఆఫీసర్ ఫర్ మోర్త్ పీజీ ప్రోగ్రాం ఆఫీసర్ సి.శశిధర్, వైశాలి ఘోర్పడే, అరుణకాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం హామీ మేరకు బడి బస్సు ఏర్పాటు

రాయదుర్గం : సిఎం చంద్రబాబు నేమకల్లు పర్యటన సందర్భంగా గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 6వ తేదీ నుంచి బడి బస్సు ఏర్పాటు చేసినట్లు రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బొమ్మనహాల్‌కు బడి బస్సు ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు చొరవతో 6వ తేదీ నుంచి ఉదయం 8-20, సాయంత్రం 4-30 గంటలకు ప్రతిరోజూ బస్సు నడుపుతామని డిఎం తెలిపారు.

నిఘానేత్రం నీడన బాక్స్ టెండర్

ఎటూ తేలని థర్డ్ పార్ట్ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్
ఇంజినీరింగ్ యంత్రాంగం మీనమేషాలు



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్ వ్యవహారం ఎటూ తేలకుండా బాక్సుకే పరిమితం అవుతోంది. తప్పులను కప్పిపుచ్చుకునే నిమిత్తం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఉండాల్సిన థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్ బాక్స్‌ను ఇంజినీరింగ్ యంత్రాంగం పరిపాలన భవనంలోకి మార్చింది. టెండర్ల వ్యవహారంలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా బాక్సును సిసి కెమెరాల నిఘా నీడలో ఉంచామని అధికారులు చెబుతున్నారు. నిబంధనల మేరకు టెండర్లను తెరవకుండా ఆ బాక్సును అటూఇటూ తిప్పడం ఏమిటంటూ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. టెండర్ బాక్సు వ్యవహారంలో ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ పరిధిలో మతలబు జరిగినట్లు తెలుస్తోంది. లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేసేలా అనర్హులకు అందలం ఎక్కించేందుకు రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయి అడ్వర్‌టైజ్‌మెంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో టెండర్ ఇచ్చారు. సెప్టెంబర్ 9వ తేదీన జారీ చేసిన ఈ ఉత్తర్వులో క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్‌ను దక్కించుకునేందుకు పది సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని షెడ్యూల్ తొమ్మిదిలో పేర్కొన్నారు. నవంబర్ నెలలో తొలిసారి టెండర్లను రద్దు చేసేందుకు గల కారణాలను కాంట్రాక్టర్లకు పత్రికా ప్రకటనా ద్వారా గానీ, లిఖితపూర్వకంగా గానీ తెలియజేయకుండా ఎగ్జిక్యూటివ్ అథారిటీలు తెలివిగా వ్యవహరించి తొలిసారి ఇచ్చిన టెండర్‌ను రద్దు పరిచినట్లుగా సిబ్బందికి ఫోను ద్వారా తెలిపి చేతులు దులుపుకున్నారు. రెండవసారి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్‌ను తిరిగి రాష్ట్ర స్థాయిలో పత్రికల ద్వారా ప్రచురింపజేశారు. రెండవసారి నిర్వహించిన టెండర్ షెడ్యూల్లో నిబంధనావళిని సవరించారు. 10 సంవత్సరాల సివిల్ వర్క్ అనుభవ స్థానంలో ఐదు సంవత్సరాల అనుభవం ఉంటే చాలునని దిద్దుబాటు చేశారు. మొదటిసారి టెండర్ దక్కించుకున్న కంపెనీ అనంతపురం నగరంలో ఆఫీస్ ఎస్టాబ్లిష్మెంట్ చేయటానికి విధించిన 15 రోజుల గడువును రెండవ సారి టెండర్‌లో 30 రోజులకు పెంచి అనర్హులకు దక్కేలా చూడటానికి కొందరు అధికారులు సాయం అందించినట్లు విమర్శలున్నాయి. నవంబర్ 27న బాక్స్ టెండర్లు తెరచిన తరువాత ఇంజినీరింగ్ అధికార యంత్రాంగం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి వాటిని ఎవాల్యూషన్ చేసే క్రమంలో నిమగ్నమయ్యారు. అయితే డిసెంబర్ 5వ తేదీ పూర్తయినా ఎవాల్యుయేషన్ ప్రక్రియ పూర్తికానట్లు తెలుస్తోంది. నెలల తరబడి టెండర్ ప్రక్రియను ఆలస్యం చేయటం ద్వారా ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులకు ఒనగూరే లాభం ఏమిటో వారికే తెలియాలి. ఒకవైపు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతుంటే వాటిలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించాల్సిన థర్డ్ పార్టీ పార్టీ కంట్రోల్ టెస్ట్ టెండర్ ప్రక్రియ మాత్రం వాయిదాలు పడుతూనే వస్తోంది. ఈ జాప్యం వెనుకు ఎగ్జిక్యూటివ్ అధికారుల అంతరంగం ఏమిటన్న దానిపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బాక్సు టెండర్ల వ్యవహారంపై ఇంత జరుగుతున్నా అటు పాలకవర్గం ఇటు అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుండడం మరిన్ని ఆరోపణలకు తావిస్తోంది. ఈ టెండర్‌లోని మతలబులు వెలుగులోకి రావాలంటే మరిన్ని రోజులు వేచి ఉండాల్సిందేనని కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

కన్వీనర్ పోస్టా.. మాకొద్దు..!

◆ ఖాళీగా కణేకల్లు వైసిపి మండల కన్వీనర్ పదవి
◆ స్వీకరించేందుకు నాయకుల అనాసక్తి
◆ 'మెట్టు' నాయకత్వంపై ఆ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి



ప్రజాశక్తి -కణేకల్లు

ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న వైసిపి ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ ఓటమిని చవిచూసింది. ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో ముఖ్య నాయకులు సైతం తెరమరుగై మౌనం దాల్చారు. రాయదుర్గం నియోజకవర్గంలో ప్రస్తుతం ఆ పార్టీ గడ్డుపరిస్థితి ఎదుర్కొంటోందనే భావన రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తం అవుతోంది. వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వడంలో సఫలీకృతం కాలేకపోతున్నారనే భావన ఆ పార్టీ నాయకుల్లో వ్యక్తం అవుతోంది. రాయదుర్గంలో వైసిపి పరిస్థితి ఎలా ఉందనేదానికి కణేకల్లు మండలమే ఒక ఉదాహరణకు చెప్పవచ్చు. వైసిపి ఎన్నికల్లో ఓడిన అనంతరం వ్యక్తి కారణాల పేరుతో ఆ పార్టీ మండల కన్వీనర్ అలూరు చిక్కణ్ణ తన కన్వీనర్ పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త వ్యక్తిని ఇప్పటి వరకు కన్వీనర్‌గా ఎన్నిక చేయలేదు. ఐదేళ్లపాటు కణేకల్లు మండలంలో తిరుగులేని పార్టీగా ఎదిగిన వైసీపీకి ఇప్పుడు కన్వీనర్ స్థాయి నాయకుడు దొరక్కపోవడం ఆ పార్టీకి పెద్ద విషమ పరీక్షగా మారిందనే చెప్పాలి. మండలంలో పార్టీకి దిశ నిర్దేశం చేసే కన్వీనర్ ఎంపికపై అధిష్టానం సైతం దృష్టి సారించకపోవడం గమనార్హం. కన్వీనర్ పని చేయాలంటూ మండల ముఖ్య నాయకులు ఎవరినీ అడిగినా 'నాకెందుకు బాబోయ్' అనే సమాధానమే వారి నుంచి విన్పిస్తోంది. రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త ఇప్పటికే ఇద్దరు పేర్లు ప్రతిపాదించగా వారు తాము ఆ బాధ్యతలు తీసుకోలేం అంటూ ఆయన ముఖం మీదే చెప్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. క్షేత్రస్థాయిలో ఏదైనా కష్టమొస్తే మెట్టు అండగా నిలుస్తాడన్న నమ్మకం మండల నాయకుల్లో లేన్నట్లు కన్పిస్తోంది. గత 14 సంవత్సరాలుగా రాయదుర్గం నియోజకవర్గంలో వైసీపీలో కీలకపాత్ర పోషించిన కాపు రామచంద్రారెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా ఆయన కార్యకర్తలకు భరోసా కల్పించేవారు. ఇప్పుడు ఆ స్థాయి నాయకుడు లేకపోవడం సమస్యగా మారిందని కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు. కణేకల్లు మండలంలో ఇటీవల రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇందులో వైసీపీ కార్యకర్తలు జైలుకూ వెళ్లారు. ఈ సమయంలో కనీసం ఆ కుటుంబ సభ్యులను సమన్వయకర్త మెట్టు కనీసం పరామర్శించకపోవడంపై వైసిపి శ్రేణులను మరింత నిర్వేదానికి గురి చేస్తోంది. మెట్టు నాయకత్వంపై తీవ్ర అసంతప్తితో ఉన్న మండల అధినాయకులు కణేకల్లు మండల కన్వీనర్ పగ్గాలు చేపట్టడానికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఎవరూ ముందుకు రాకపోవడం వల్లే ఆ పదవి చాలా రోజులుగా ఖాళీగా ఉంది. భవిష్యత్తులో అయినా వైసిపి కన్వీనర్ పోస్టును భర్తీ చేస్తారా.. లేక అలాగే ఖాళీగా ఉంచుతారా అన్నదానిపై ఒక స్పష్టత రాని పరిస్థితి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనే కన్పిస్తోంది.

బకాయి వేతనాల కోసం కలెక్టరేట్ ముట్టడి

మేయర్ ఛాంబర్ వద్ద ధర్నా.. ప్రభుత్వం, అధికారుల తీరుపై మున్సిపల్ అదనపు కార్మికుల ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్పొరేషన్ కార్మికుల బకాయి వేతనాలు, రూ.15 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనంతపురం కలెక్టర్ కార్యాలయాన్ని సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గురువారం ముట్టడించారు. కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట జరిగింది. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు తిరుమలేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఏటీఎం.నాగరాజు మాట్లాడుతూ అదనపు కార్మికులు, కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్, ఆటోడ్రైవర్లకు బకాయి ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. 2023వ సంవత్సరం డిసెంబర్ నెలలో పాలకవర్గం మున్సిపల్ ఆఫీస్ ఉన్నతాధికారులు 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా అదనపు కార్మికులకు రూ.15వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తిస్తామన్నారు. హామీ ఇచ్చి ఏడాది కావస్తోన్నా ఇవి అమలుకు నోచుకోలేదన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

మేయర్ ఛాంబర్ వద్ద ఆందోళన

పారిశుధ్య కార్మికులు కార్పొరేషన్ మేయర్ ఛాంబర్ వద్ద బైటాయించి ఆందోళన నిర్వహించారు. మేయర్ సలీం వసీంకు అదనపు కార్మికుల సమస్యలను వివరించారు. అనంతపురం పట్టణ జనాభాకు అనుకూలంగా 200 మంది పైగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన పారిశుధ్య కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎక్స్‌గ్రేషియా, డెత్ క్లెయిమ్‌లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమస్యలపై మేయర్ స్పందిస్తూ అధికారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, నల్లప్ప, పెన్నోబులేసు, అదనపు కార్మికులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

టిడిపి విజయం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. పెద్దవడుగూరులో టిడిపి భవనం నిర్మించేందుకు గురువారం ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారి వెంట పర్యటించి దుకాణ యజమానులతో మాట్లాడారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. సిఎం చంద్రబాబు ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసిన ప్రతి కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని పరిస్థితులు, సమస్యలపై చర్చించారు. పేట శివాలయం వెనుక కాలనీలో ఓ విద్యార్థి గుత్తిలో డిగ్రీ చదువుతున్నానని బస్సు సౌకర్యం సరిగా లేదని తెలుపడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే గుత్తి డిపో మేనేజర్‌తో చర్చించి బస్సు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగరాజు, చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, కొండూరు కేశవరెడ్డి, ఆవులంపల్లి కేశవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, బాషా, కూనా రామకృష్ణారెడ్డి, దస్తగిరి కూనవెంకటరెడ్డి, రాజారెడ్డి, చిరంజీవులు, ఉపేంద్ర, లక్ష్మీనారాయణ, రమేష్ యాదవ్, నరేంద్రరెడ్డి, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


టిడిపి కార్యాలయం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమెందుకు?

అధికారులపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

భూసమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయాలంటే ఉండండి.. లేదంటే మరో ప్రాంతానికి వెళ్లిపోండని మండిపడ్డారు. గతంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, రాప్తాడు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించినా ఫలితం లేదన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలిచ్చినా మండలాల్లో అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రజలను ఇబ్బంది పెడితే కచ్చితంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. గ్రామాల వారీగా మీకు ముందస్తుగానే సమాచారం అందుతుందన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలంలోని కాటిగానికాలువ, ఆత్మకూరు మండలంలోని బి.యాలేరు, రాప్తాడు మండలంలోని బొమ్మేపర్తి, చెన్నేకొత్తపల్లి మండలంలోని కనుముక్కల, కనగానపల్లి మండలంలోని మద్దలచెరువు, రామగిరిలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. ఈ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.

8న జాతీయ ఉపకార వేతనం పరీక్ష

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

2024-25 విద్యా సంవత్సరానికి ఈ నెల 8వ తేదీ జాతీయ ఉపకార వేతన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం డిఇఒ జాతీయ ఉపకార వేతనం పరీక్ష సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు కేటాయించామని, 3,665 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. హాల్ టికెట్స్‌ను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వారి కార్యాలయం వెబ్ సైట్ www.bse.ap.gov.inలో ఉంచామని, హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ హెచ్.గోవిందనాయక్ పాల్గొన్నారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-రాయదుర్గం

లింగ వివక్షను నిర్మూలిస్తేనే సామాజిక పురోగతి, మహిళలపై వివక్ష తొలగితేనే సమ సమాజం సాధ్యమని వైద్యాధికారి డాక్టర్ రమేష్, మహిళా శిశు సంక్షేమ అధికారిణి ఆవుల పద్మావతి, ఆరోగ్య విద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ వీరేష్ అధ్యక్షతన 'లింగ వివక్ష-బాల్యవివాహాలు-లింగనిర్ధారణ పరీక్షలు-మహిళా విద్య-సాధికారత' అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనాధిగా ఆడకూతురికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోతే భవిష్యత్తులో మానవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలు అరికడతామని, మహిళా హక్కులు సాధిస్తామని, లింగ వివక్షను నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ అధికారులు అశ్విని, రేణుకాదేవి, సెక్రటరీ రూప, మహిళా అధ్యాపకులు, బాలికలు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలోని కల్లూరు గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో వరిలో వచ్చిన దిగుబడులు, రబీలో సాగు చేస్తున్న పంటలు, విత్తనాలు, ఎరువుల ధరలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట కోసేటప్పుడు వాతావరణంలో మార్పులను గమనించాలన్నారు. వర్షాలకు నష్టపోయిన పంటల గురించి చర్చించారు. అనంతరం రైస్ మిల్లులను సందర్శించారు. ఆమె వెంట ఏవో సోమశేఖర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.


రైతులతో చర్చిస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని బండ్లపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త విజయశేఖర్‌బాబు, భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రోజా పుష్పలత, తాడిపత్రి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు చంగల్ రాయుడు ముఖ్య అతిథులుగా హాజరై నేల స్వభావం, వాటి సంరక్షణ, భూసార పరీక్షల వల్ల ఉపయోగాలను రైతులు, విద్యార్థులకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ పంటలు సాగు చేసే ప్రతి రైతు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి పెట్టుబడిని తగ్గిం చి దిగుబడిని పెంచుకొని తద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థుల కు భూసార పరీక్షలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన ముగ్గురికి జ్ఞాపికలు అందజేశారు. అలాగే విద్యార్థుల చేత తమ తమ వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలు సేకరించి ఆ మట్టిని విశ్లేషణ చేసి భూసార పరీక్ష పత్రాలను బండ్లపల్లిలో రైతులకు ఇచ్చారు. చివరగా రైతులు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఏవో చెన్నవీరస్వామి, ఎఇఒ రాము, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శేషగిరి, ఎస్‌ఎంసి ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల అధికారులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.


ప్రపంచ నేలల దినోత్సవం ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గంలోని 5 మండలాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను నియమిస్తూ గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం టౌన్ ప్రెసిడెంట్‌గా బి.నాగరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఈశ్వర్, జనరల్ సెక్రెటరీగా కాంగ్రెస్ దాదా, కళ్యాణదుర్గం రూరల్ ప్రెసిడెంట్‌గా బోయ పార్థ, వైస్ ప్రెసిడెంట్‌గా గౌరీ శంకర్, కంబదూరు ప్రెసిడెంట్‌గా ఎం.మధుసూదన్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.దామోదర్, జనరల్ సెక్రటరీగా బి.సత్యనారాయణ, సెక్రటరీగా వి.హనుమంత్ రాయుడు, కుందుర్పి మండల ప్రెసిడెంట్‌గా బొజ్జప్ప, వైస్ ప్రెసిడెంట్‌గా బి.హనుమంతురాయుడు, జనరల్ సెక్రటరీగా కె.మారుతి, సెక్రటరీగా జి. గోపాల్, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షుడిగా సన్నప్ప, జనరల్ సెక్రెటరీగా జయరామ్, శెట్టూరు ప్రెసిడెంట్‌గా జి.మల్లయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.గోవిందప్ప, జనరల్ సెక్రటరీగా జి.శివకుమార్, సెక్రటరీగా బి.శ్రీరాములును నియమించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు.

వైసిపి బలోపేతానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-కుందుర్పి

వైసిపి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆ పార్టీ మేధా విభాగం తాలూకా అధ్యక్షులు బెస్తరపల్లి ఎస్.బాబు పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి రంగయ్య మండలంలో 4 విభాగాల అధ్యక్షులను నియమించారు. వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా సైనికుల్లా పని చేస్తామన్నారు. మండల నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో వీరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అందులో మేధావిభాగం తాలూకా అధ్యక్షులుగా ఎస్.బాబు (బెస్తరపల్లి), ఎస్సీ సెల్- ఎన్.తిప్పేస్వామి(జంబుగుంపల), చేనేత విభాగం-ఆర్.శ్రీనివాసులు (తెనగళ్లు), ఐటి విభాగం-సి.మర్రిస్వామి(అపిలేపల్లి)ని ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

ప్రజాశక్తి-అనంతపురం

అన్నమయ్య జిల్లాలో మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ సిరాజుద్దీన్, సెక్రటరీ లింగమూర్తి కోరారు. చిన్న చిన్న పొరపాట్లకే ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి వేధించే అధికారులు, ఉపాధ్యాయుల మీద జరిగే దాడులను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చట్టాలను ప్రవేశ పెట్టాలని, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం డిఇఒ ఎం.ప్రసాద్ బాబుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ ఎన్.రమణారెడ్డి, లింగమయ్య, డిప్యూటీ ఛైర్మన్ పురుషోత్తం, కె.వెంకటరత్నం, శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహులు, ఎస్. రామాంజనేయులు, రవీంద్ర, రాయల్ వెంకటేష్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, రాజశేఖర్, వెంకటరమణ, హనుమంతు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

గుత్తి : ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో నాయకులు అహోబిలేసు, ప్రసాద్ మాట్లాడుతూ రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మృతి బాధాకరమన్నారు. అనంతరం ఎంఇఒ బి.రవినాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఆంజనేయులు, బసవరాజు, జయకుమార్, శ్రీనివాసులు, శంకరయ్య, ఆసిఫ్, ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నాటుసారా జోరు..!

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రస్తుతం ప్రయివేటు మద్యం షాపుల్లో విక్రయాలు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతుండగా దానికి తోటు నాటుసారా జోరు గ్రామాల్లో కన్పిస్తోంది. ఆత్మకూరు మండల పరిధిలోని అటవీ ప్రాంతాలకు అనుకుని ఉన్న గ్రామాల్లో దీనిని తయారు చేసి అమ్ముతున్నట్లు సమాచారం. సింగంపల్లి తండా, గొరిదిండ్ల తండా, వేపచెర్ల ఎగువ, దిగువ తండాల్లో నాటుసారా తయారవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితం అయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నాటుసారాపై నిఘా ఉంచి దానిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 14వ తేదీ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్ బి.సుభాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీ కాదగిన అన్ని రాకల కేసులను పరిష్కరిస్తామన్నారు.

రేపు పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం రవికుమార్, పిఇటి ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర, తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు హాజరుకావాలని వారు కోరారు.

జనన ధ్రువీకరణ పత్రం ఇక సులభతరం

కళ్యాణదుర్గం రూరల్ : సెల్ఫ్ డిక్లరేషన్, ఎఫ్-10 స్కూల్ రికార్డు, పుట్టిన వివరాలు ఉంటే చాలు లేట్ రిజిస్ట్రేషన్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ ఇస్తామని తహశీల్దార్ భాస్కర్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా సర్వే

ప్రజాశక్తి-పామిడి

మండలంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను గ్రామ సచివాలయ సిబ్బంది జనవరి ఆఖరు లోపు(ఎంఎస్‌ఎంఈ) సర్వే యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో తేజోష్ణ గురువా రం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేలో నమోదైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఉద్యమ్ గుర్తింపు సంఖ్య కేటాయిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు, ఇతర సౌకర్యాలు పొందవచ్చు అన్నారు. ప్రభుత్వాలు ఆహ్వానించే టెండర్లలో పాల్గొనడానికి అర్హత పొందుతారన్నారు. మండలంలోని వర్తక, వాణిజ్య సంఘాలు ఈ సర్వేలో నమోదు చేసుకోవాలని, సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కూతలేరు వంక వద్ద మురికి నీరు మళ్లింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో 'అస్తవ్యస్తంగా డ్రెయినేజీ' అని ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందిం చారు. గురువారం మురికినీటిని దారిని మళ్లించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి కూతలేరు వంక వరకూ రోడ్డు వేశారు కానీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాలువను ఏర్పాటు చేయలేదు. దీంతో బస్టాండ్ ఆవరణలోని దుకాణాలు, నివాస గృహాల నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేక అక్కడే నిల్వ ఉంటుంది. దీంతో అక్కడ దుర్గంధం వెదజల్లడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాం డ్ నుంచి కూతలేరు వంక వరకూ డ్రెయినేజీ కాలువను నిర్మించాలని ప్రజలు కోరుతు న్నారు.

7న ఎస్కెయులో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బోటనీ విభాగానికి అకడమిక్ కన్సల్టెంట్స్ కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఉంటాయని పిఆర్ఒ ఆచార్య కె.రామ్‌గోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాలిక్యులర్ బయాలజీ, బయో ఇన్ఫర్మటిక్స్, జెనెటిక్ ఇంజినీరింగ్ సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుంది. సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు.

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో గురువారం టిడిపి మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు బాలాజీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా రైతులు విద్యుత్ సమస్య ఎదుర్కొంటుండగా ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో గొరిదిండ్ల గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించారన్నారు. వీటి పనులను నాణ్యతగా వేగవంతంగా పూర్తి చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక్ బాబు, సత్యనారాయణ, కృష్ణమూర్తి, లింగన్న, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న బాలాజీ

17, 18న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గుత్తి

విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో గుత్తిలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 32వ మహాసభల కు సంబంధించిన పోస్టర్లను గురువారం వారు విడు దల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ రాష్ట్రానికి విద్య కోసం బడ్జెట్‌ను కేటాయించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రూ. 3,480 కోట్లు పెండింగ్లో ఉన్నాయన్నారు. జిల్లా మహాసభల్లో విద్యారంగ సమస్యల పరిష్కారం, భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. జిల్లా మహాసభలను విద్యార్థులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ధను, బాలాజీ, నాయకులు శివ, నవీన్ యాదవ్, షేక్షావలి, సుధాకర్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా ఎం.తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు ఎం.తిమ్మారెడ్డిని, ఉపాధ్యక్షుడుగా గుల్ఫరోజ్‌ను నియమిస్తూ డిసిసి అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాషా, మైనారిటీ అధ్యక్షుడుగా షేక్ ఇస్మాయిల్, మండల అధ్యక్షుడుగా బోయ చంద్రశేఖర్, మైనారిటీ అధ్యక్షుడుగా నబిరసూల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పట్టణ అధ్యక్షుడు ఎం.తిమ్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా పోరాటాలు చేస్తామన్నారు.


తిమ్మారెడ్డి


గుల్ఫరోజ్

పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటాం : విప్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర ఆయకట్టు కింద వరి పంట సాగు చేసి తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. మండలంలోని లింగదహాల్ గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశులు కౌలుకు సాగు చేసిన వరి పంట తుపాను ధాటికి నేల వాలింది. ఈ పంటను ఎమ్మెల్యే పరిశీలించి అక్కడే విలేకరులతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి అంచనా వేయాలని తహశీల్దార్ మునివేలు, వ్యవసాయ అధికారిని ఆదేశిం చారు. అలాగే ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులను ప్రభుత్వం ఆదుకునేలా విజ్ఞప్తి చేస్తామన్నారు. వరి పంట కోసిన రైతులు ధాన్యాన్ని దళారులు చేత అమ్మవద్దని, ప్రభుత్వమే ఉద్దేహాల్, కణేకల్లు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వ ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్ కోరామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబిరసూల్, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు గోనెల కేశవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు మోహన్ ఉన్నారు


వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

మండలంలో టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. సభ్యత్వ నమోదుపై స్థానిక ఎల్‌బి నగర్‌లో మండల కన్వీనర్ బలరాముడు ఆధ్వర్యంలో నిర్వహించి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో 50 బూత్‌ల నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పెంగల్ తుపాను కారణంగా నష్టపోయిన కంది, మునగ రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా రైతులతో కలిసి మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో మునగ తోటను పరిశీలించారు. రైతులు ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు చేయగా పంట చేతికందే సమయంలో పెంగల్ తుఫాను కారణంగా పూత మొత్తం రాలిపోయిందన్నారు. అలాగే కంది పంట కూడా ఈ వర్షాల కారణంగా దెబ్బతిందన్నారు. తక్షణమే వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఆయా పంటలను పరిశీలించి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వారి వెంట సంఘం జిల్లా నాయకురాలు శిరీష, మండల కమిటీ సభ్యులు జయశేఖర్‌రెడ్డి, రైతులు నాగరత్నమ్మ, హరినాథ్‌రెడ్డి, పెద్ద నరసింహులు, రంగారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణప్ప, హరి ఉన్నారున.


కంది పంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

సూగేపల్లిలో ఆర్వో ప్లాంట్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట ఇచ్చాడంటే చేస్తాడని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, సర్పంచి వనిత మల్లికార్జున తెలిపారు. మండలంలోని సూగేపల్లి గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్(తాగునీటి శుద్ధ జల కేంద్రం) మరమ్మతులకు గురవడంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించారు. సూగేపల్లి చనమల్లేశ్వరస్వామి జాతర నేపథ్యంలో భక్తుల కోసం గురువారం ఎంపీడీఓ నందకిషోర్, పంచాయతీ కార్యదర్శి అనిత ఆర్వో ప్లాంట్‌ను పునః ప్రారంభిం చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంజుల వన్నూరుస్వామి, ఉప సర్పంచి శాంతిమంజు, డీలర్ శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచి తమ్మన్న, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

రాయలసీమ గాస్పల్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అనంతపురం రూరల్ మండలంలోని సజ్జలకాలువలో రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి అధ్యక్షతన ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు, బిషప్ రెవరెండ్ డాక్టర్ బి.ప్రభాకర్ రెడ్డి హాజరై జీసస్, క్రిస్మస్ విశిష్టతను వివరించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకులు బ్రదర్స్ సెబస్టియన్ రాజు, ఎస్తేరు ప్రభాకర్‌రెడ్డి, అసోసియేషన్ సెక్రటరీ పాస్టర్ జిఆర్ ఆనంద్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి.మనషే, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ జహంగీర్ జాషువా, బిషప్ వాసు అనిల్ కాంత్, పాస్టర్ ఎలీషా, రోజ్లీ రాజేష్, స్వరూప్, ప్రెస్కిలా, సీయోను ఫుల్ గాస్పల్ ప్రేయర్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రెండు రోజుల డిపిఆర్‌సి లెవెల్ ట్రైనింగ్ ఆన్ 9 థీమ్స్ ఆఫ్ ఎల్‌ఎస్‌డిజి శిక్షణను గురువారం నగరంలోని జడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని డిపిఆర్‌సి సమావేశ మందిరం నిర్వహించారు. ముందు గా జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. కంబదూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి రాఘవేంద్ర మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌ఛార్జి ముఖ్యకార్య నిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, శిక్షణ అబ్జర్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విస్తరణ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

12 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

కారుణ్య నియామకాల్లో భాగంగా జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ తన ఛాంబర్‌లో 12 మందికి ఆఫీస్ సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధత, బాధ్యతగా ఉండాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని దిశా నిర్దేశం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, జిల్లాలో వీటిని విజయవంతం చేసేలా అధికారులందరూ సమన్వయంతో ముందుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో రెవెన్యూ సదస్సులపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, రైతు సంఘం నేతలతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయన్నారు. జిల్లాలోని 504 గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులలో హౌసింగ్, పంచాయతీ, విద్య, సర్వే, ఎస్పీడీసీఎల్, రిజిస్ట్రేషన్, సివిల్ సప్లైస్, తదితర శాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో పని చేయాలని సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఇందులో ప్రజాప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సదస్సులో ఇన్‌ఛార్జి డిఆర్ఒ తిప్పేనాయక్, ఆర్డీవోలు కేశవ నాయుడు, శ్రీనివాస్, వసంతబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఉరవకొండ, విడపనకల్లు మండలాల తహశీల్దార్లు మహమ్మద్‌బాషా, సునీతాబాయి ఆదేశించారు. విడప నకల్లు తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సులపై గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, మండల సర్వేయర్, రీ సర్వే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు.

పామిడి : ఈ నెల 6 నుంచి 28వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసదస్సుల్లో పట్టాదారు పాసు పుస్తకాలు, రెవెన్యూ శాఖకు సంబంధించి 55 రకాల సేవలు అందిస్తామని, ఆయా అంశాలపై అర్జీలు ఇస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



విద్యార్థులు తీసుకొచ్చిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎజిఎం.సుబ్బారెడ్డి

శ్రీచైతన్య ఎటిపి-8లో 'ఫుడ్ కార్నివల్ ఈవెంట్'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం హౌసింగ్‌బోర్డు శ్రీచైతన్య ఈటెక్నో పాఠశాలలో గురువారం ఉదయం ఫుడ్‌కార్నివాల్ ఈవెంట్‌ను నిర్వహించారు. ప్రైమరీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహకారంతో భోజనం తయారు చేయించుకుని తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి ఎజిఎం.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆహార నియమాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తీసుకొచ్చిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ అరుణ్ కిరణ్, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సబితలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జులు దైవకృప, అర్షియా రషీదా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతను కలిసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రాప్తాడు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరిటాల సునీతను కలిసి సమస్యలను విన్నవించారు. అలాగే రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 7వ తేదీ జరిగే పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం రాప్తాడు పిహెచ్‌సి డాక్టర్లు, హౌసింగ్ అధికారులు, రాష్ట్రస్థాయి అంగన్వాడీ యూనియన్ సభ్యులు కలిశారు.

రోడ్లపై సంచరించే పశువుల తరలింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని వారపు సంత మైదానం వద్ద రోడ్లపై తిరుగుతున్న పశువులను గురువారం స్థానిక శాంతినగర్‌లోని ఖాళీ స్థలం వద్దకు తరలించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి వాహన యజమానులకు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం లేకపోవడంతో రోడ్లపై తిరుగుతున్న పశువులను మున్సిపల్ ఉద్యోగులు తరలించారు. పశువుల యజమానులు జరిమానా చెల్లించి తమ పశువులను విడిపించుకోవాలని, మరోమారు ఇలాగే వదిలితే పెద్దమొత్తంలో జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

నేడు మెడికుర్తిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-యల్లనూరు

నేడు మండల పరిధిలోని మేడుకుర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ప్రారంభిస్తు న్నట్లు తహశీల్దార్ రాజ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెవెన్యూ సదస్సు కొనసాగు తుందన్నారు. రైతులు పాల్గొని వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులు ఇవ్వొచ్చన్నారు. నేటి నుంచి మండల వ్యాప్తంగా జరిగే గ్రామసభలను ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ తెలియజేశారు.

అత్యధిక సభ్యత్వాల నమోదే లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల నమోదే లక్ష్యంగా పని చేస్తున్నామని పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు తెలిపారు. నగరంలోని పదో డివిజన్‌లో ఇప్పటికే 500 సభ్యత్వాలు పూర్తి చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మెంబర్‌షిప్ కోఆర్డినేటర్ విష్ణు, రజక ఫెడరేషన్ స్టేట్ డైరెక్టర్ పరమేశ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, రాహుల్, సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని చక్రాయపేట, వెస్ట్ నరసాపురం, ఆకులేడు గ్రామాల్లో జరుగుతున్న పశువుల షెడ్లు, సీసీ రోడ్లను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారి శేషానందరెడ్డి తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. అలాగే పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని బి.పప్పూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో గురు వారం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు వైద్యులు, వైద్య సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి వైద్య సేవలు అందించారు. డాక్టర్ మహేంద్రనాథ్ కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, వాటి వల్ల దుష్ప్రభావాలు, నివారణ మార్గాలు, జాగ్రత్తలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వైద్య, పాఠశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మట్టి అక్రమ దందాను అడ్డుకోరా..?

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లి గ్రామం వద్ద మట్టి అక్రమ తవ్వకం, తరలింపును తక్షణమే అడ్డుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సింధనూరు నాగరాజు కోరారు. నిత్యం రాత్రివేళ వందలాది టిప్పుల మట్టిని అక్రమంగా సమీపంలోని హేలిస్ బ్లూ స్టీల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన మట్టిని స్టీల్ ఫ్యాక్టరీకి తరలిస్తుండగా పోలీసు, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులకు పెద్ద మొత్తంలో మట్టి దందా నిర్వాహకులు డబ్బు ఇస్తున్నారని, అధికారుల అండదండలతోనే మట్టి అక్రమ దందా నడుస్తోం దని ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించిన వారిని చంపేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, సిఎం చంద్రబాబు స్పందించి మట్టి అక్రమ దందాపై సిబిఐ విచారణకు ఆదేశించాలని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సింధనూరు నాగరాజు కోరారు.

కుష్టుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-శింగనమల



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు ఐరన్ మాత్రలు వేశారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్(లెప్రసీ) బాలఓబులు వ్యాధి లక్షణాలు, చికిత్స, ఉచిత మందుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, సూపర్వైజర్లు అశ్వర్థనారాయణ, నాగమ్మ, ఎఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు మంజుల, పద్మావతి, వెంకటమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

శ్మశానవాటికల్లో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని వెస్ట్ నరసాపురం పంచాయతీలోని గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం గ్రామాల శ్మశానవాటికల్లో గురువారం సర్పంచి గుజ్జల వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి ఆధ్వర్యంలో జెజిబి సాయంతో ముళ్లపొదల తొలగించి శుభ్రం చేయించారు. సర్పంచి మాట్లాడుతూ వెస్ట్ నరసాపురం శ్మశానవాటిక పూర్తిగా కంపచెట్లు, చెత్త, చెదారం నిండిపోయి ఉండడంతో శుభ్రం చేయించామని తెలిపారు. నాగులగుడ్డం, గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థులకు 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్'

ప్రజాశక్తి-ఆత్మకూరు

స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్' కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో 'ఉపాధి' హామీ చట్టంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకో వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బొమ్మనహాల్‌లో గురువారం సిఐటియు నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా కేవలం వైసిపి హయాంలో పని చేశారనే కక్ష సాధింపుగా ఐదుగురిని తొలగించడంతో పాటు ఐదు గురికి ఇవ్వడం సమంజసం కాదన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం పట్టణ సిఐ యువరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు చేసి కర్నాటక మద్యం విక్రేతను అరెస్టు చేశారు. సిఐ తెలిపిన వివరాలు.. పట్టణంలోని చౌడమ్మ ఆలయ వీధిలో మారంపల్లి కాలనీకి చెందిన ఓబులేసు మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి అతడి నుంచి 192 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను(90ఎంఎల్) సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా కర్నాటక మద్యం, పేకాట, మట్కా, గంజాయి, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వీటి గురించి సమాచారం తెలిస్తే టౌన్ సిఐ 9490106284కు తెలపాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పుట్లూరు : తాడిపత్రి నుంచి చింతకుంట మీదుగా రామలింగయ్యపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తాడిపత్రికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం ఎస్ఐ హేమాద్రి సీజ్ చేశారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

స్థానిక మారంపల్లి కాలనీలో నివాసం ఉంటున్న రవి బాడుగ నిమిత్తం చాపిరికి వెళ్లి వస్తుండగా చాపరి–దొడఘట్ట గ్రామాల మధ్యలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రవికి తీవ్ర గాయాలు కావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలో బుధవారం నజియాపై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడు దాదా ఖలందర్‌ను అరెస్టు చేసినట్లు సిఐ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. బండగేరిలో ఆంజనేయస్వామి గుడి వద్దకు వెళ్తున్న నజియాపై పాత కక్షలను మనసులో పెట్టుకున్న దాదా ఖలందర్ వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచాడని తెలిపారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.